శెనార్తి మీడియా
మన యాసే.. మన బలం



## 23న మినీ జాబ్ మేళా

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 23న మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయ భవన సమావేశ మందిరంలో ఈ మేళా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.హైదరాబాద్, మంచిర్యాల, కరీంనగర్, వరంగల్, మేడ్చల్ ప్రాంతాల్లోని ప్రైవేట్ సంస్థలలోని ఖాళీలను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నట్టు వివరించారు. ఇందులో టాటా స్ట్రైవ్ (25 పోస్టులు), ఎల్టి ఫైనాన్స్ (20), ఆర్‌బిఎల్ బ్యాంక్ (50), హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ (50), పాక్స్వ్ (15), హాప్పీ మొబైల్స్ (20), సీతారాం స్పిన్నర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (100), బిగ్–సి మొబైల్స్ (10) సంస్థలు పాల్గొననున్నాయి. అభ్యర్థుల విద్యార్హతల ఆధారంగా వివిధ విభాగాల్లో పోస్టులు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9502786438, 7702284181, 9963452486, 9110368501 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. అర్హత కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

తాండూర్ డలంలోని గోపాల్ నగర్ గ్రామపంచాయతీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) ఫీల్డ్ అసిస్టెంట్ రాజయ్యను సస్పెండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా డీఆర్డీఓ కిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. గోపాల్ నగర్ విధుల్లో నిర్లక్ష్యం, నర్సరీ నిర్వహణ, మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేయడం వలన మొక్కలు ఎండిపోయినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ పై ఫిర్యాదులు అందాయి. దీంతో ఇటీవల డీఆర్డీఏ ప్లాంటేషన్ మేనేజర్ క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపారు. నర్సరీ నిర్వహణ లోపం, విధుల్లో నిర్లక్ష్యం వహించడం వలన మొక్కలు ఎండిపోయాయని విచా రణలో తేలింది. దీంతో ప్లాంటేషన్ మేనేజర్ ఫీల్డ్ అసిస్టెంట్ పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేది కను అందజేశారు.

## మెను ప్రకారం భోజనం పెట్టాలి



**శెనార్తి మీడియా, బెజ్జూర్ :**

విద్యార్థులకు మెను ప్రకారం భోజనం పెట్టాలని బెజ్జూర్ తహసీల్దార్ రామ్మోన్‌రావు అన్నారు. శనివారం మండలంలోని కుంటలమానపల్లి గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంటశాల, డైనింగ్, డార్మెంటల్‌ను పరిశీలించడంతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సకాలంలో యూనిఫాంలు, కాస్మెటిక్, బుక్‌లు తదితర వాటిని అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. విషజ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

# వైభవంగా మడలేశ్వర బోనాల జాతర

- బంగారు బోనం ఊరేగింపుతో ఆలయానికి వచ్చిన భక్తులు



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మడలేశ్వర స్వామి బోనాల జాతరను మంచిర్యాల జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బంగారు బోనంతో రజక కుటుంబం విశ్వనాథ ఆలయం వద్దకు చేరుకుని, అక్కడి నుంచి డప్పు చప్పుళ్లతో, బోనాల ఊరేగింపుగా మడలేశ్వరాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బోనాల ఉత్సవాలు తమ వృత్తి సాంప్రదాయాన్ని ప్రతిబింబించేవిగా ఉంటాయని, భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఈ జాతరలు సమాజాన్ని ఏకం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తంగేలపల్లి వెంకటేష్, కార్యదర్శి పాయిరాల రాములు, పట్టణ అధ్యక్షుడు పారుపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యుడు మస్కె చందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంగెపు హనుమంతు, జిల్లా ఉపాధ్యక్షుడు నడిగోట తిరుపతి, సహాయ కార్యదర్శి పైతార్ ఓదెలు, మందమర్రి పట్టణ అధ్యక్షుడు గంగరాజుల రామచందర్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు తోటపల్లి రమేష్, పట్టణ క్యాషియర్ రమేష్, సారయ్య పాల్గొన్నారు.

# ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోండి..



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని చిన్నతరహా, పెద్దతరహా వ్యాపారస్థులు తక్షణమే ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ సూచించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.పట్టణంలోని వ్యాపార సంబంధిత షాపులకు ట్రేడ్ లైసెన్స్‌ను వెంటనే రిన్యువల్ చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు లైసెన్స్ పొందని వారు లేదా ఫీజు బకాయిలు చెల్లించని వారు మున్సిపాలిటీకి వెంటనే ఫీజు చెల్లించాలని తెలిపారు.రెన్యువల్ చేయకపోతే 5 వేల నుంచి 10వేల రూపాయల వరకు జరిమానా విధించబడుతుందనీ, అవసరమైతే సంబంధిత షాప్‌పై 25 రెట్లు పెనాల్టీ విధిస్తామన్నారు. ట్రేడ్ లైసెన్స్ వ్యవహారంలో నిర్లక్ష్యం వహిస్తే తెలంగాణ మునిసిపల్ చట్టం – 2019 ప్రకారం శాసన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# నిరుపేద విద్యార్థికి అండగా నిలిచిన ఎస్పీఎఫ్ ట్రస్ట్



**శెనార్తి మీడియా, గంగాధర**

గంగాధర మండలం గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థికి శ్యాంప్రసాద్ లాల్ ఫ్రెండ్స్ అండగా నిలిచారు. నిరుపేద చేనేత కుటుంబానికి చెందిన బొల్లబత్తిని పద్మ– చంద్రమౌళి దంపతుల కుమారుడు బొల్లబత్తిని శుభచరణ్ కేరళలోని పాలక్కడ్ ఐఐటీలో సీటు సాధించాడు. ఐఐటీ అభ్యసించడానికి ఆర్థిక సహకారం అందించాలని తెలంగాణ రాష్ట్ర మహాత్మ జ్యోతీరావుఫూలే విద్యాసంస్థల సంయుక్త సంచాలకులు, శ్యాంప్రసాద్ లాల్ ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జీవీ.శ్యాంప్రసాద్ లాల్‌ను సంప్రదించారు. శ్యాంప్రసాద్ లాల్ మిత్ర బృందం శుభచరణ్ ఐఐటీ చదువు నిమిత్తం రూ. 1,24,414ను శనివారం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎస్పీఎఫ్ ట్రస్ట్ కన్వీనర్ గోనె శ్రీనివాస్, హౌసింగ్ కార్పొరేషన్ పీడీ సోమ రాజేశ్వర్, ఎస్పీఎఫ్ మిత్ర బృందం జెట్టి సంపత్, చేరాల మల్లికార్జున్ దేవ్, మనోహర్, శరత్ చంద్ర, కృష్ణగోపాల్ పాల్గొన్నారు.

## విద్యపై అవగాహన అవసరం

- ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు 31 వరకు గడువు..




**శెనార్తి మీడియా, మంచిర్యాల**

ప్రతి ఒక్కరూ విద్య అవసరాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందని, దైనందిన జీవితంలో చదువుకు ప్రాధాన్యత ఎంతో ఎక్కువగా ఉంటుందని జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం తెలిపారు. నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలో శనివారం నిర్వహించిన ఓపెన్ స్కూల్ అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టాస్ ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాల గడువును ఈ నెల 31 వరకు పొడిగించామని చెప్పారు. జిల్లాలో కనీసం 2,500 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. చదువు మధ్యలో మానేసిన విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, ఉద్యోగాల్లో ఉన్న వయోజనులు తిరిగి చదువుతూనే జీవనోపాధి కొనసాగించవచ్చని తెలిపారు.జిల్లా విద్యాధికారి యాదయ్య, టాస్ పరిశీలకులు విజయకృష్ణ, భగీరథ, ఎ.సి.జి.ఈ. దామోదర్, సెక్టోరియల్ అధికారి చౌదరి సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.పి. పందు జనార్దన్, బండ శాంకరి, సుమన్, మెప్మా టి.పి.ఎంలు, ఓపెన్ స్కూల్ సెంటర్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

## మెరిట్ స్కాలర్‌షిప్‌కు అవకాశాలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

ఇంటర్ లేదా తత్సమాన పరీక్షల్లో 80 శాతం కన్నా ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు ప్రధాని ఉచ్చత శిక్ష ప్రోత్సాహన్ యోజన కింద మెరిట్ స్కాలర్‌షిప్ పొందేందుకు అర్హులని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.చక్రపాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉపకార వేతనం ద్వారా డిగ్రీ విద్యార్థులకు మొదటి మూడేళ్ల పాటు ఏటా రూ.12,000 చొప్పున, పీజీ విద్యార్థులకు నాలుగవ, ఐదవ సంవత్సరాల్లో రూ.20,000 చొప్పున స్కాలర్‌షిప్ అందుతుంది. ఇతర స్కాలర్‌షిప్‌లు పొందని వారు, వార్షిక కుటుంబ ఆదాయం రూ.4.5 లక్షలలోపు ఉన్నవారికి మాత్రమే ఇది వర్తిస్తుంది. ఎంపికైన విద్యార్థులు ప్రతీవ సంవత్సరం కనీసం 50 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాల కోసం కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## వడ్డీ భారం తాళలేక యువకుడి ఆత్మహత్య

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



మంచిర్యాల అశోక్‌నగర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి బైరి రమేష్ (36) తీవ్ర ఆర్థిక సమస్యలతో మనస్తాపానికి గురై మృతి చెందాడు. ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. గత నాలుగేళ్లుగా రమేష్ మధ్యవర్తుల ద్వారా ఇతరుల నుంచి ఐదు రూపాయల వడ్డీపై సుమారు పదిలక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. వడ్డీలు చెల్లించడంలో చిక్కులు తలెత్తి అసలు మొత్తాన్ని చెల్లించలేని స్థితికి చేరుకున్నాడు. తీవ్ర ఆందోళనతో ఈ నెల 17న ఉదయం 11 గంటల సమయంలో మంచిర్యాల కాలేజీ రోడ్డులోని పద్మనాయక ఫంక్షన్ హాల్ సమీపంలోని ఖాళీ స్థలంలో గడ్డి మందు తాగి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో వాంతులు చేయడంతో కుటుంబ సభ్యులు అతన్ని స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి 12.30 గంటలకు రమేష్ మృతి చెందాడు. ఈ ఘటనపై రమేష్ భార్య శ్వేత ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ మజహర్‌ఉద్దీన్ ఆత్మహత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## పేద విద్యార్థికి ఆర్థిక సాయం



**శెనార్తి మీడియా, ఆసిఫాబాద్:**

జిల్లాకు చెందిన పేదింటి విద్యార్థికి రూ.50వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో ఐఐటి విద్యార్థి ఆత్రం వంశీకృష్ణకు రూ.50వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కెరమెరి మండలం నిషాని గ్రామానికి చెందిన ఆత్రం తిరుపతి కుమారుడు ఆత్రం వంశీకృష్ణకు చెన్నైలో ఐఐటీ సీటు లభించినట్లు తెలిపారు. ఉన్నత చదువుల కోసం రూ.50వేల చెక్కును అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో చదివి అత్యున్నత విద్యాసంస్థ చెన్నై ఐఐటీలో సీటు సంపాదించడం గర్వకారణమని అన్నారు. గిరిజన యువతకు ఆదర్శనీయమని అన్నారు. విద్యార్థి వంశీకృష్ణ చదువులో మరింత రాణిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఈ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సురభి కాన్వెంట్‌లో బోనాల సంబరాలు





**శెనార్తి మీడియా, గంగాధర**

గంగాధర మండలం మధురానగర్ సురభి కాన్వెంట్ హైస్కూల్లో బోనాల వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, టీచర్స్ సంప్రదాయ వస్త్రధారణతో హాజరై అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు కోలాటం, తెలంగాణ జానపద నృత్యాలు, పాటలతో అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చిప్ప వీరేశం, డైరెక్టర్ చిప్ప వీరనర్సయ్య, టీచర్స్ పాల్గొన్నారు.



## నాణ్యమైన పాలు సరఫరా చేయాలి

- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**శెనార్తి మీడియా, ఆసిఫాబాద్:**

జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల విజయ బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్ నుంచి నాణ్యమైన పాలు సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని విజయ బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా యూనిట్‌లో బల్క్ మిల్క్ కూలింగ్ యంత్రాలు, పాలు శుద్ధి చేసే యంత్రాలను పరిశీలించారు. పాలు సేకరించడం, సరఫరా చేస్తున్న వివరాలను తెలుస్తున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ పాడి పరిశ్రమ, సహకార సమాఖ్య, విజయ పాల డెయిరీ ఆధ్వర్యంలో జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలకు పాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం దష్ట్యా నాణ్యమైన పాలు సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే పాలు పూర్తి పోషకాలతో నాణ్యంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట యూనిట్ మేనేజర్ నవీన్, సరఫరాదారులు నారాయణ, సిబ్బంది ఉన్నారు.

# విద్యతోనే సమాజంలో మార్పు




**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:**

విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని అంకోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రతినెలా మూడవ శనివారం నిర్వహిస్తున్న ఆరోగ్య జాతర గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరోగ్య జాతర కార్యక్ర మంలో విద్యార్థులు గ్రామసభ, డ్రగ్స్‌పై ప్రదర్శించిన ప్రదర్శనను తిలకించి అభినందించారు. స్టూడెంట్ ఛాంపియన్లకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం న్యూట్రీ గార్డెన్, వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటా రు. బియ్యాన్ని పరిశీలించిన అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంచి ఆరోగ్య అలవాట్లు, చెడు అలవాట్లు దరిచేరకుండా ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో వారు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు.